సాక్షి పార్వతీపురం మన్యం

శనివారం । 27 । జనవరి । 2024



ఉత్తర్వుల అందజేత - 8లో

జెడ్పీ పరిధిలో పదోన్నతులు పొందిన ఉద్యోగులు, కారుణ్య నియామకాల్లో ఉద్యోగం పొందిన వారికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఉత్తర్వులు అందజేశారు.



రామతీర్థంలో సహస్రదీపాలంకరణ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి వారికి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సహస్రదీపాలం కరణతో ఆరాధించారు. - 8లో



సెంచూరియన్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలు - 8లో

టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో తొమ్మిది సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను వీసీ పి.కె.మహంతి శుక్రవారం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలన


- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలన సాగుతోందని, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందజేస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గణతంత్రదినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ బాలమురళీకృష్ణ జాతీయజెండాను ఎగురవేయగా, రాజన్నదొర జెండా వందనం చేశారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో ముఖ్యమంత్రి సాకారం చేశారన్నారు. ప్రపంచంలోనే ఎత్తైన, భారత రాజ్యాంగ నిర్మాతైన అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో నిర్మించి అంబేడ్కర్ గొప్పతనాన్ని ప్రపంచమంతా తెలిసేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో కరిష్మా



విజయవాడ రాజ్‌భవన్ లాంజ్‌లో గవర్నర్‌ను కలిసిన బోటు కరిష్మా

కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బోటు కరిష్మా ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించడంతో గణతంత్ర వేడుకలకు పిలుపు అందింది. ఈ మేరకు విజయవాడ రాజ్‌భవన్ లాంజ్‌లో గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ శుక్రవారం ఏర్పాటు చేసిన తేనేటి విందుకు హాజరైంది. విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లకు బదిలీ

విజయనగరం: మున్సిపల్ శాఖ పరిధిలోని వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న కమిషనర్‌లు, అసిస్టెంట్ కమిషనర్‌లకు బదిలీ అయింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కమిషనర్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డి శ్రీరాములనాయుడును మాతృశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో విశాఖ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.మల్లయ్యనాయుడును నియమించారు. విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.వి.డి.ప్రసాదరావును గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా నియామకంకాగా, ఆయన స్థానంలో ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యదర్శి సీహెచ్ తిరుమలరావు అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.

- బొబ్బిలి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీనివాస్‌ను విశాఖ జీవీఎంసీకి బదిలీ చేయగా ఆయన స్థానంలో విశాఖ జీవీఎంసీలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎల్.రామలక్ష్మిని నియమించారు.
- బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సీహెచ్ సత్యనారాయణ నియామకమయ్యారు.
- పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జె.రామప్పలనాయుడును రాజాం బదిలీ చేయగా, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.సింహాచలంను అక్కడకు బదిలీ చేశారు.
- సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా గ్రేటర్ విశాఖ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకటరమణ బాధ్యతలు చేపట్టనున్నారు.

అన్నింటా ప్రగతి పథం

- గణతంత్ర దినోత్సవం సాక్షిగా కలెక్టర్ పతాక సందేశం
- జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన నిషాంత్ కుమార్
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- ప్రగతిని ప్రతిబింబించిన వివిధ శాఖల శకటాలు
- అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్తాం
- విధుల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు





జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్







గణతంత్ర వేడుకల్లో చిన్నారుల నృత్యప్రదర్శనలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా అన్నిరంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సాక్షిగా ప్రగతి మంత్రాన్ని గణాంకాలతో వినిపించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామికం, పర్యాటక రంగాల్లో జిల్లా దూసుకుపోతోందన్నారు. ప్రజల్లో నవరత్నవికాసం స్పష్టం కనిపిస్తోందని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్లు వివరించారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా శుక్రవారం సాగిన గణతంత్రం దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా జాతీయ జెండాను కలెక్టర్ ఎగురవేశారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధ్యక్షతన నిర్వహించిన పోలీస్ పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని వివరించారు. ఆయన మాటల్లోనే...

అన్నదాతకు అండ

ప్రభుత్వ ఆదేశాల మేరకు 185 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేశాం. 40,420 మంది రైతుల నుంచి రూ.447 కోట్ల విలువైన 2,23,124 మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలుచేశాం. రూ.348 కోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేశాం. గన్నీ సంచులు, కూలీలు, రవాణా ఖర్చుల కింద రూ.9.80 కోట్లు చెల్లించాం. జిల్లాలో కొత్తగా 2,055 రేషన్ కార్డులను మంజూరు చేశాం.

- ఖరీఫ్ సీజన్‌లో 22,900 క్వింటాళ్ల విత్తనాలను, 11,204 టన్నుల ఎరువులను దాదాపు లక్ష మంది రైతులకు సరఫరా చేశాం. వైఎస్సార్ రైతు భరోసా -పీఎం కిసాన్ పథకం కింద 1,45,954 కుటుంబాలకు రూ.167 కోట్లు అందించాం. 9,766 మందికి సీసీఆర్‌సీ కార్డ్స్ జారీ చేసి, క్రాప్ ఇన్సూరెన్స్ కింద 11,232 మంది రైతులకు రూ.6.59 కోట్లు బీమా పరిహారంగా అందజేశాం. జిల్లాలో 12 మందికి 'వ్యవసాయ డ్రోన్ల' పై శిక్షణతో పాటు లైసెన్సులు ఇచ్చామన్నారు.
- పార్వతీపురం మన్యం జిల్లా ప్రధానంగా వ్యవసాయ ఆధారిత జిల్లా. పంటల సీజన్‌లో సాగు నీటి ఎద్దడి తలెత్తకుండా 4 మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులను ఆధునీకరిస్తున్నాం. 2023 సంవత్సరంలో జిల్లాలో 819 ఎకరాల కొత్త ఆయకట్టుకు తోటపల్లి కుడికాలువ నీటిని అందించాం. 2023-24 సంవత్సరంలో రూ.80.84 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించాం.

విద్యారంగానికి పెద్దపీట

ప్రతిఒక్కరూ ప్రామాణిక విద్యను అభ్యసించాలని ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. జిల్లాలో 'మైస్కూల్-మై ప్రైడ్' కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి ఉన్నత పాఠశాలకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాం. పదోతరగతిలో శత శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

- జగనన్న అమ్మ ఒడి పథకం కింద 83,733 మంది తల్లుల ఖాతాల్లో రూ.126 కోట్లు జమచేశాం. జగనన్నవిద్యా దీవెన కింద 20,306 మంది విద్యార్థులకు రూ.23.42 కోట్లు, జగనన్న వసతి దీవెన కింద 17,172 మందికి రూ.15.84 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. జగనన్న విదేశీ విద్యా దీవెన కింద గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన విద్యార్థి సత్యసాయికి రూ.9,65,540 అందించింది. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాలలో భాగంగా ముగ్గురు విద్యార్థులకు లక్ష రూపాయల చొప్పున అందించింది.
- జిల్లాలో వైద్యరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. జీఎస్‌డబ్ల్యూఎస్ స్థాయిలో అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, మహిళా పోలీస్‌లను టీమ్‌గా వేసి ఎంపీడీఓ పర్యవేక్షణలో ప్రతి మండలంలో ఎనమిక్ యాక్షన్ ప్లాన్ అమలుచేస్తున్నాం. రక్తహీనత నివారణకు కృషిచేస్తున్నాం. మాతాశిశు మరణాల నివారణకు జిల్లాలో పీఆర్‌ఐఎస్‌ఎం-10 అనే ప్రాజెక్టు ప్రత్యేకంగా అమలవుతోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీచేశాం. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కింద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. కంటి వెలుగు కింద 18,773 మందికి పరీక్షలు చేసి 1260 మందికి ఉచితంగా శస్త్రచికిత్స చేశాం. జిల్లాకు 2,55,632 వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు కాగా ఇప్పటికే 1,76,071 కార్డులు పంపిణీ చేశాం. జిల్లాలో వైద్య కళాశాల, పార్వతీపురం, సీతంపేటలలో మల్టీస్పెషాలిటీ, సాలూరు, కురుపాం, భద్రగిరి, సీతంపేటల సీహెచ్‌సీల అభివృద్ధి పనులు చివరిదశలో ఉన్నాయి.
- జిల్లాలోని 2,21,885 గృహాలకు 2024 సంవత్సరం నాటికి సురక్షిత తాగునీటిని అందించాలన్నది లక్ష్యం. జల్‌జీవన్ మిషన్ కింద 75,000 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. ఇప్పటివరకు 1,66,413 గృహాలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నాం. తాగునీటి పైప్‌లైన్ పనులకు రూ.25 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఖర్చుచేసింది. ఈ ఏడాది మరో రూ.15 కోట్లు ఖర్చుచేసి 75,000 గృహాలకు కుళాయి కనెక్షన్లు వేస్తాం.



విద్యాశాఖ శకటం (ప్రథమ బహుమతి)



ఓటరు అవగాహన (ఎస్‌వీఈఈపీ) శకటం (ద్వితీయ బహుమతి)



డీఆర్‌డీఏ శకటం (తృతీయ బహుమతి)

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

గణతంత్ర దినోత్సవాల్లో డీవీఎంఎం, కేపీఎం స్కూల్ (పార్వతీపురం), జోగింపేట, భామిని కేజీబీవీలు, అకాజోడు జీటీడబ్ల్యూహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. డీఆర్‌డీఏ, వ్యవసాయం, పోలీస్, ఆరోగ్యం ఐసీడీఎస్, విద్యాశాఖ, జలవనరులు, ఐటీడీఏ తదితర ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలను ప్రదర్శించాయి. వివిధ ప్రభుత్వ శాఖలు స్టాల్స్‌ను ఏర్పాటుచేశాయి. ఉత్తమ ప్రతిభకనబరిచిన జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

ప్రభుత్వ శకటాలలో విద్యాశాఖ శకటం మొదటి బహుమతికి ఎంపికకాగా, ఓటరు అవగాహన (ఎస్‌వీఈఈపీ) శకటం, డీఆర్‌డీఏ శకటాలు వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో కేజీబీవీ భామిని విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్, అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఆర్డీఓ కె.హేమలత, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు

పేదలందరికీ ఇళ్లు పథకం కింద పీఎంఎవై గ్రామీణ్‌తో సహా జిల్లాలో 27,142 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 12,448 గృహాల నిర్మాణం పూర్తయింది. 19,872 గృహాలు బేస్‌మెంట్ లెవెల్, ఆపై స్థాయిల్లో ఉన్నాయి. గృహ నిర్మాణంలో రాష్ట్రంలో జిల్లా 4వ స్థానంలో నిలిచింది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో తాగునీటి సరఫరాకు రూ.31.37 కోట్లతో 433 పనులు మంజూరుచేశాం. ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద 7,660 మందికి రూ.81లక్షల ఆర్థిక ప్రయోజనం చేకూరింది.

- ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో 3.95 లక్షల జాబ్ కార్డులు మంజూరయ్యాయి. పనికి వచ్చే వారందరికీ 100 రోజుల పని దినాలు కల్పించాం. ఈ ఏడాది వేతనంగా రూ.223.27 కోట్లు చెల్లించగా, మెటీరియల్ కంపోనెంట్‌గా రూ.60 కోట్లు చెల్లించాం. అమృత్ సరోవర్ పనులు క్రింద 108 చెరువులను సుందరీకరించాం.

నవరత్న వెలుగులు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు తదితర అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం 'నవరత్నాలు' అమలుచేస్తోంది. వైఎస్సార్ పింఛన్ కానుక కింద నెలకు రూ.3వేలు అందజేస్తోంది. జిల్లాలో కొత్తగా 1693 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. జిల్లాలోని 1,43,800 మంది పింఛన్ దారులకు నెలకు రూ.37 కోట్లు అందజేస్తోంది. వైఎస్సార్ ఆసరా కింద 16,699 మహిళా సంఘాలకు రూ.378 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద 77,995 మందికి రూ.147 కోట్లు, వైఎస్సార్ కళ్యాణమస్తు కింద 1700 మందికి రూ.11.84 కోట్లు, జగనన్నతోడు కింద 7,460 మందికి రూ.7.59 కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పించింది. వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీనేస్తం తదితర పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోంది.

- పారిశ్రామికీకరణలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది సింగిల్ డెస్క్ విధానంలో రూ.48.29 కోట్ల విలువగల పెట్టుబడులతో 50 యూనిట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశాం.

మౌలిక సదుపాయాల కల్పన

జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. పీఎంజీఎస్వై కింద 1008 రహదారి పనులు రూ.1260 కోట్ల ఖర్చుతో తలపెట్టగా 230 పనులు పూర్తయ్యాయి. సిగ్నల్ సమస్యలను తొలగించేందుకు 190- 4జీ టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టగా 77 టవర్లు పూర్తయ్యాయి. మరో 47 టవర్ల పనులు పూర్తి కానున్నాయి.

- జిల్లాలో 311 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం ప్రారంభించగా 125 భవనాలు పూర్తయ్యాయి, 128 భవనాలు ప్రగతిలో ఉన్నాయి. 301 ఆర్బీకే భవనాలకు 99 నిర్మాణాలు పూర్తయ్యాయి. 89 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.
- 192 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, 19 మిల్క్ బల్క్ కుకింగ్ కేంద్రాలు, 85 డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏడాదిలో 58 రోడ్ల నిర్మాణాలకు అటవీ అనుమతులు మంజూరయ్యాయి.
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అందిన అర్జీల మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.44.73కోట్లతో 1766 పనులు చేపట్టాం. ఇప్పటి వరకు 353 పనులు పూర్తయ్యాయి. 1413 పనులు ప్రగతిలో ఉన్నాయి. 632 తాగు నీటి పనులు, సీసీ డ్రైనేజీ పనులను రూ.14.83 కోట్లు మంజూరు చేయగా, 177 పనులు పూర్తి చేశాం. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.

పర్యాటకానికి ప్రాధాన్యం

అందమైన, సుందర ప్రదేశాలు గల జిల్లాలో పర్యాటకానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని వినియోగించుకుని పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటకానికి నిలయంగా మారాలని ప్రణాళికలను సిద్ధం చేశాం. సీతంపేటలో గిరిజన మ్యూజియం, జగతిపల్లి, అడలి వ్యూ పాయింట్‌ల వద్ద పర్యాటక పనులను రూ.1.40 కోట్లతోను, గుమ్మలక్ష్మీపురం మండలం ఎస్.కె.పాడులో ఎకో టూరిజం ప్రాజెక్టు పనులు రూ.1.80 కోట్లతో శరవేగంగా సాగుతున్నాయి.

- జిల్లాలో ఈ ఏడాది 542 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశాం. 293 జగనన్న కాలనీలలో విద్యుదీకరణ పనులు చేపట్టి 225 పనులు పూర్తి చేశాం. 22 పనులు ప్రగతిలో ఉన్నాయి. పార్వతీపురం మండలం అడ్డాపుశీల, బలిజిపేట మండలం అరసాడ గ్రామాల్లో రూ.4 కోట్లు వ్యయంతో 2 సబ్ స్టేషన్లు నిర్మించాం.


యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

జిల్లా యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండేలా 'అభిలాష' కింద 97 సచివాలయాల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేశాం. 12,804 ప్రామాణిక పుస్తకాలను అందుబాటులోకి తెచ్చాం. 200 సచివాలయాల్లో రూ.2 కోట్ల ఖర్చుతో గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 20 జాబ్ మేళాలు నిర్వహించి 2,581 మందికి ఉపాధి కల్పించాం. 4 స్కిల్ హబ్‌ల ద్వారా 694 మందికి శిక్షణ కల్పించగా 443 మందికి ప్లేస్‌మెంట్‌లు లభించాయి.

సమగ్ర భూ సర్వే

జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం కింద భూముల రీ సర్వే చురుగ్గా సాగుతోంది. 366 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ ప్రారంభించి 291 గ్రామాల్లో పూర్తిచేశాం. ఏడాది కాలంలో జిల్లాలో 2,540 మంది లబ్ధిదారులకు 1947 ఎకరాల భూమిని పంపిణీ చేశాం. మరో 681 మంది లబ్ధిదారులకు 507 ఎకరాల భూమికి హక్కులు కల్పించాం. 4,504 ఎకరాలకు 5,665 డీ పట్టాలు అందించి శాశ్వత భూ హక్కులను ప్రభుత్వం కల్పించింది. సాగుదారులను హక్కుదారులుగా మార్చింది.

గిరిజన ద్రోహి చంద్రబాబు



ధార గెడ్డపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న, డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర


- జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గిరిజన వికాసం
- కొండకోనల్లో అభివృద్ధి వెలుగులు
- సంక్షేమ ప్రదాత జగన్‌మోహన్‌రెడ్డిను మారోసారి ఆశీర్వదించండి
- డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన



నిర్మాణం పూర్తయిన నీలంవలస నుంచి గుమిడిగూడ బీటీ రోడ్డుపై గిరిజనులతో మాట్లాడుతున్న డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కొండకోనల్లో సంక్షేమ, అభివృద్ధి వెలుగులు విరాజిల్లుతున్నాయని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పాచిపెంట మండలంలో రూ.4.3 కోట్లతో చేపట్టే ఆలూరు నుంచి మోదుగ బీటీ రోడ్డు, రూ.7.45 కోట్లతో గాదిలమడ సమీపంలో ధారగెడ్డపై నిర్మించనున్న వంతెన పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.3.74 కోట్లతో నిర్మించిన నీలంవలస నుంచి గుమిడిగూడ బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు గిరిజన ప్రాంతాల గురించి పట్టించుకోలేదన్నారు. గిరిజనులను నిలువునా మోసం చేశారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గిరిజనులను ఉద్దరిస్తానంటూ చంద్రబాబు, ఆయన గజదొంగల ముఠా వస్తోందని, వారి మాయ మాటలను నమ్మిమోసపోవద్దన్నారు. సాలూరు నియోజకవర్గంలో కనీసం ఒక గిరిశిఖర గ్రామానికైనా రోడ్డు వేశారా అని ప్రశ్నించారు. కేవలం గిరిజనుల ఓట్లు తప్ప వారి ఆర్థికాభివృద్ధి టీడీపీ నాయకులకు అవసరంలేదన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన ప్రాంతాల్లో సంక్షేమ, అభివృద్ధి పవనాలు వీస్తున్నాయన్నారు. ప్రతి కుటుంబానికి వివిధ పథకాల కింద ఆర్థిక ప్రయోజనం కల్పించారన్నారు. గిరిజనుల ఖాతాలకే నేరుగా నిధులు జమచేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు తదితర అభివృద్ధి పనులు తలపెట్టారని చెప్పారు. గిరిజనాభివృద్ధికి కృషిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల, జెడ్పీవైస్ చైర్మన్ కొర్రజన్ని సింహాచలం, వైస్ ఎంపీపీలు మీసాల నారాయణ, కొరిపల్లి రవీంద్ర, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోలబాబ్జి, జేసీఎస్ కన్వీనర్ టి.గౌరీశ్వరరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు సింహాచలం, అప్పలనాయుడు, లచ్చయ్య, సీతయ్య, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 4న వ్యాకులమాత యాత్ర



కొండడాబాల చర్చిలో దివ్యబలి పూజను నిర్వహిస్తున్న ఫాదర్స్

కొత్తవలస: మండలంలోని కొండడాబాల వ్యాకులమాత యాత్ర ఫిబ్రవరి 4న జరగనుందని ఆ క్షేత్ర విచారణకర్త గురుశ్రీ డాక్టర్ గొంగాడ రాజు తెలిపారు. వచ్చేనెల 2వ తేదీ వరకు జరగనున్న నవదిన పూజాప్రార్థనలో భాగంగా దివ్యబలిపూజను శుక్రవారం ప్రారంభించారు. ఫాదర్ వై.వి.రమేష్ పతావిష్కరణ చేశారు. ఫాదర్ ప్రభాకర్, వేళాంగిణి, జోజయ్య, గొంగడ రాజు, వై.వి.రమేష్‌లు అతిపరిశుద్ధ దివ్య బలి పూజను సమర్పించారు.

సేవలకు గుర్తింపు

● అవార్డులకు ఎంపికైన జిల్లా అధికారులు

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులకు అవార్డులు లభించాయి. 75వ గణతంత్రదినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ పలువురు జిల్లా అధికారులు ప్రశంసాపత్రాలను అందజేశారు.



కె. శ్రీనుబాబు, జిల్లా అగ్నిమాపకాధికారి; రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి; కె. హేమలత, ఆర్డీఓ; వి. తిరుపతయ్య, జిల్లా మత్స్యశాఖాధికారి; ఆర్. అప్పలనాయుడు, ఇరిగేషన్ ఈఈ; జీపీపీ ప్రసూన, జిల్లా అటవీశాఖాధికారి



కె. కవిత, డీసేబుల్డ్ వెల్ఫేర్ ఎడి; టీపీఎస్ సుధాకర్, జిల్లా ప్రజా రవాణా అధికారి; శశికుమార్, ఎంవీఐ; సి. మల్లికార్జున రెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి; ఎస్. వెంకటేశ్వరరావు, డీఎస్‌డీఓ; యుసాయికుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి; ఎస్.ప్రేమ్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి; ఒ.ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ; వేణుగోపాలరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ; సి.మధుబాబు, జిల్లా ప్రొహిబిషన్ అధికారి; బి. సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి; ఇంజినీర్ కృష్ణాజీ, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి; డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు, డీఎంఓ; డాక్టర్ బి.వాగ్దేవి, డీసీహెచ్‌ఎస్; డాక్టర్ బి.జగన్నాథ రావు, డీఎంహెచ్‌ఓ

బి. ద్రోణాచార్యులు, ఎ.సి. కమర్షియల్ టాక్స్; జి. శాంతేశ్వరరావు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్; ఆర్. శివప్రసాద్, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి; డాక్టర్ ఎం.వినోద్, జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి; వై. సత్యంనాయుడు, ఏపీడీ; ఆర్.ఉమామహేశ్వర రావు, ఏఓ, కలెక్టరేట్; డి.రవి, సూపరింటెండెంట్, హెచ్ సెక్షన్ కలెక్టరేట్; జి. శ్రీరామ్మూర్తి, సూపరింటెండెంట్, కలెక్టరేట్; డి.చంద్రమౌళి, డీటీ, కలెక్టరేట్; ఎ. ఉమామహేశ్వర రావు, సీసీటు కలెక్టర్; డీవీ సీతారామయ్య, తహసీల్దార్, జియ్యమ్మవలస; ఎస్. శివన్నారాయణ, తహసీల్దార్, పార్వతీపురం; ఎస్.ధనుంజయరావు, సీఐ, సాలూరు రూరల్; కె.నీలకంఠం, ఎస్సై కొమరాడ; ఎం.వెంకటరమణ, ఎస్సై సాలూరు రూరల్

ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎంపీడీఓ, సీతానగరం; పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, జియ్యమ్మవలస; పి.లక్ష్మీకాంత్, ఎంపీడీఓ, పాచిపెంట; కె. గీతాంజలి, ఎంపీడీఓ, సీతంపేట; ఎస్.సాల్మన్‌రాజు, ఎంపీడీఓ, గుమ్మలక్ష్మీపురం; షేక్ మహ్మద్ జావేద్, ఎంపీడీఓ, పార్వతీపురం; కె. మణికంఠరేష్, ఫారెస్టు రేంజర్; ఎం.సింహాచలం, డిప్యూటీ జైలర్; కె.శ్రీరాములు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్; ఎస్.హర్షవర్ధన్, జేఏ, డీపీఓ; ఎం.సత్యనారాయణ, ఏఎస్సై; కె. కృష్ణమూర్తి, హెచ్‌సీ; ఎం. కృష్ణమూర్తి, సీఐ, ఎస్ఈబీ; ఎస్.విజయ్‌కుమార్, రిజర్వ్ ఎస్సై; ఎస్.శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్

ఎం.జగపతిరావు, ఏఈ, ఐలండ్‌పీఆర్; పి. ప్రసాద్, ఓఎస్, ఐలండ్‌పీఆర్; కె. వెంకటరత్నం, డీఈఈ, ఏపీఈపీడీసీఎల్; జి. రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం; జి. సత్యనారాయణ, ఏఎంవీఐ, పార్వతీపురం; జీఎస్ఎస్ఆర్‌కె కుమార్, ఏఎంవీఐ, పాలకొండ; టి.రామారావు, జేఏ, కలెక్టరేట్; జి.నవీన్, సీసీటు జేసీ; టి. లక్ష్మణ్, టీఎస్ ఐలండ్‌పీఆర్; పి. కిరణ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ; డి. రామచంద్రరావు, డ్వామా పీడీ; ఎం. దేవుళ్ల నాయక్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్; జేఎల్ఎన్ మూర్తి, లీడ్ బ్యాంక్ మేనేజర్; కె. సత్యన్నారాయణ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి; వీవీ గోపాలకృష్ణ, డీఎల్‌డీఓ

క్లుప్తంగా

సెంచూరియన్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ పీకే మహంతి, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో తొమ్మిది సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సలెన్స్ కేంద్రాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పరిశోధనలు జరపడానికి, పేటెంట్ పొందడానికి, పరిశోధన పత్రాల ముద్రణ, నూతన ఆవిష్కరణలకు ఇది ఒక మంచి వేదిక అని పేర్కొన్నారు. ఈ వేదికలో విద్యార్థులు, అధ్యాపకులు భాగస్వామ్యం కావడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్ఈబీ ఏఈఎస్‌గా జీవన్ కిశోర్



ఏఈఎస్‌గా బాధ్యతలు చేపట్టిన జీవన్‌కిశోర్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఈబీ ఏఈఎస్‌గా జీవన్ కిశోర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఆవిర్భావం తరువాత ఏఈఎస్ పోస్టును నియమించడం ఇదే మొదటిసారి. ఆరు నెలల శిక్షణ కాలం అనంతరం పార్వతీపురం మన్యం జిల్లా ఏఈఎస్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిధిలో సారా, మద్యం అక్రమ రవాణా నిర్మూలనకు కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా మరింత పటిష్టం చేసి తనిఖీలు ముమ్మరం చేస్తామని తెలిపారు. జిల్లాకు ఒడిశా రాష్ట్ర సరిహద్దులు ఎక్కువగా ఉండడంతో ఆ రాష్ట్రంలో తయారైన సారాను దిగుమతి చేస్తున్నారని, ఈ విషయంపై దృష్టి సారించి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలలో ఇరురాష్ట్రాల అధికారులతో సంయుక్తంగా అంతర్రాష్ట్ర దాడులు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. జిల్లాలో సారాను నిర్మూలించేందుకు సిబ్బంది సహకారంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య



నీలంనాయుడు(ఫైల్)

సంతకవిటి: మండల పరిధిలోని పోతురాజుపేట గ్రామానికి చెందిన పోతురాజు నీలం నాయుడు(21) శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నీలం నాయుడు ప్రేమవ్యవహారం వికటించిన కారణంగా మనస్తాపం చెంది మండల పరిధిలోని మిర్తివలస గ్రామంలో గల తాతగారింట్లో పురుగు మందు తాగేశాడు. గమనించి హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా మృతి చెందారని, తండ్రి అచ్యుతరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు కొప్పెర్ల విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడగా.. నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులు ఎ. రాజు, బి.హరి, పి.జస్వంత్, జి. నిఖిల్‌బాబు ఫిబ్రవరి 7,8,9 తేదీలలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, పీడీ కృష్ణ, పీఈటీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు.

సీబీసీఎన్‌సీ పటిష్టతకు కృషి

విజయనగరం టౌన్: ది కన్వెన్షన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చెస్ ఆఫ్ నార్తరన్ సర్కార్స్ (సీబీసీఎన్‌సీ) పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీబీఎన్‌సీ సంఘ అధ్యక్షుడు ఎంఏ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో సీబీసీఎన్‌సీ 69వ సార్వజనీన మహాసభ ఘనంగా నిర్వహించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

భంజ్‌దేవ్ వర్గీయులు సంధ్యారాణి వర్గంలో చేరిక

● వైఎస్సార్‌సీపీని వీడినట్లు తప్పుడు ప్రచారం శోచనీయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: నియోజకవర్గంలోని టీడీపీలో ఓ వర్గమైన మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ అనుయాయులు అదే టీడీపీలో మరో వర్గమైన సంధ్యారాణి గూటికి చేరితే వారు వైఎస్సార్‌సీపీని వీడినట్లు టీడీపీ నాయకులు సిగ్గులేకుండా ఎలా ప్రచారం చేసుకుంటున్నారో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఉపముఖ్యమంత్రి కార్యాలయం వద్ద వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు స్థానిక విలేకరులతో మాట్లాడారు. నెలిపర్తిలో 500 కుటుంబాలు టీడీపీలో చేరాయని వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా టీడీపీ చేసిన ప్రచారాన్ని ఖండించారు. గ్రామంలో ఉన్న టీడీపీకి చెందిన భంజ్‌దేవ్ వర్గీయులే సంధ్యారాణి గూటికి చేరారని స్పష్టంచేశారు. గ్రామంలో కేవలం 250 కుటుంబాలే ఉంటే 500 కుటుంబాలు చేరడం ఎలా సాధ్యమైందని ఎద్దేవా చేస్తూ, దీనికి టీడీపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు ఎప్పటికప్పుడు ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ ప్రజాక్షేత్రంలో అభాసుపాలవుతున్నారని మండిపడ్డారు. ఇకనైనా ఇటువంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు.

వారి కుమ్ములాటలు తప్పుదారి పట్టించేందుకు..

ఇటీవల నూతన సంవత్సర వేడుకల్లో భంజ్‌దేవ్ ఇంటికి తేజోవతి చేరడం, శంబర జాతరనేపథ్యంలో తేజోవతి ఫ్లెక్సీలు చించేయడం, సంధ్యారాణి ముఖానికి పసుపు పూయడం వంటి టీడీపీలోని అంతర్గత కుమ్ములాటలను ప్రజలు చూస్తున్న క్రమంలో వాటిని పక్కదారి పట్టించేందుకే ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలోనూ పలువురికి బలవంతంగా టీడీపీ కండువాలు కప్పగా వారు నేడు వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్న పరిస్థితులు ప్రజలకు తెలుసునన్నారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉందని, టీడీపీ, ప్రతిపక్షాలు ఎన్ని తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు చేసినా రాజన్నదొరను అడ్డుకోలేరని, అఖండ మెజారిటీతో మళ్లీ రాజన్నదొర గెలవడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అల్లుసూరప్పలనాయుడు, వేణు,సంగంరెడ్డిజయసింహా, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత



నారాయణమ్మకు ట్రై మోటార్ సైకిల్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ పరిధిలో విధులు నిర్వహిస్తూ పదోన్నతులు పొందిన ఉద్యోగులు, కారుణ్య నియామకాల్లో భాగంగా ఉద్యోగం పొందిన వారికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. కారుణ్య నియామకంలో బి.రమ్యశ్రీకి ఎల్.కోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో, బొత్స హరితకు చింతాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ సహాయకులుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అలాగే పదోన్నతులు పొందిన ఎల్.ముఖేశ్వరరావును సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో, డి.దుర్గాప్రసాద్‌ను పార్వతీపురం పీఐయూ డివిజన్‌లో టైపిస్టులుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. రాజాన భారతిని ఉద్దవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల కార్యాలయం సహాయకురాలిగా నియామకపత్రం అందజేశారు. ఆఫీస్ సబార్డినేట్లుగా విధులు నిర్వహిస్తున్న కె.రమేష్‌కుమార్‌ను పూసపాటిరేగ ఎంపీడీవో కార్యాలయంలో, బి.అఖిల్‌కుమార్‌ను పార్వతీపురం పీఆర్ఐ డివిజన్‌లో టైపిస్టులుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రై మోటార్ సైకిల్ పంపిణీ

తెర్లాం మండలం నందబలగలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న వికలాంగురాలు ఎం.నారాయణమ్మకు జెడ్పీ నిధుల నుంచి కొనుగోలు చేసిన రూ.1.2 లక్షలు విలువ చేసే ట్రై మోటార్ సైకిల్‌ను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు జెడ్పీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, బొబ్బిలి, గంట్యాడ జెడ్పీటీసీ సభ్యులు ఎస్.శాంతకుమారి, వర్రి నరసింహమూర్తి, అధికారులు, జెడ్పీ కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



మృతురాలి ఇంటి దగ్గర సిబ్బందితో కలిసి విచారణ చేపడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

భోగాపురం: మండలంలోని మహరాజుపేట గ్రామానికి చెందిన ముద్దాడ అప్పయ్యమ్మ(76) తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పయ్యమ్మ భర్త కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా మహరాజుపేట గ్రామంలో నివాసముంటోంది. రోజూ పగటిపూట బయటకు వచ్చి తిరిగే అప్పయ్యమ్మ శుక్రవారం ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చి రాజాపులోవలో ఉన్న ఆమె కుమార్తె నల్ల గంగమ్మకు సమాచారం అందించారు. దీంతో ఆమె మహరాజుపేట గ్రామానికి చేరుకుని తన తల్లి ఇంటి తలుపులు తెరిచి చూడగా అప్పయ్యమ్మ శవమై కనిపించింది. ఆమె ఒంటి మీద ఉన్న సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు (గాజులు, గొలుసు) కనిపించకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, అక్కడినుంచి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు అనుమాస్పద మృతిగా కేసు నమోదు చేసి, సీఐ వెంకటేశ్వరరావు అధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. అప్పయ్యమ్మ ప్రమాదవశాత్తు ఇంట్లో కాలుజారి చనిపోయిందా? లేదా ఆమె వంటిపై ఉన్న బంగారు ఆభరణాలను అపహరించడం కోసం ఎవరైనా హత్య చేసి ఉంటారా? అన్న కోణంలో విచారణ చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

స్వీప్ శకటంతో ఎలక్షన్‌పై అవగాహన



పట్టణంలో చక్కర్లు కొడుతున్న ఎన్నికల శకటం

పార్వతీపురం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎలక్షన్ మీద అవగాహన కోసం ఏర్పాటుచేసిన సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) శకటం ప్రజలకు మరింత అవగాహన పెంపొందించేందుకు పార్వతీపురం పట్టణంలో శుక్రవారం చక్కర్లు కొట్టింది. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఆర్డీఓ కె.హేమలత ఆదేశాల మేరకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో మొదటిసారి ఎన్నికల శకటాన్ని గణతంత్ర వేడుకలలో ప్రదర్శించారు. గణతంత్ర దినోత్సవం అనంతరం ఈశకటాన్ని ప్రజలందరి మధ్య ప్రదర్శించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంనుంచి చర్చి సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, నాలుగు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్ జంక్షన్ మీదుగా ఫ్లై ఓవర్, బైపాస్ రోడ్‌పై చక్కర్లు కొట్టి అందరినీ ఆకర్షించింది. ఎన్నికల పట్ల అందరికీ అవగాహన కలిగి ఉండాలని ఒక నమూనా ఎన్నికల కేంద్రాన్ని రూపొందించామని ఆర్డీఓ హేమలత తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

● ఎంపీపీ కల్యాణి



వీఆర్‌ఓ రామకృష్ణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న తహసీల్దార్ భాస్కరరావు

పూసపాటిరేగ: అంకిత భావంతో విధులు నిర్వహించిన తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల స్థాయిలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ శాఖలకు చెందిన 16 మందికి ఆమె అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీడీఓ జి.రాధిక, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, వ్యవసాయ అధికారి కె.నీలిమ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, టొంపల సీతారాం, తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి ఉత్తమ సేవలు అందించిన నలుగురు బీఎల్‌ఓలకు తహసీల్దార్ భాస్కరరావు అవార్డులు అందజేశారు.

సైనిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవం



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రిల ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో భాగంగా ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. సైనిక పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యానికి కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి దేశభక్తి, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పన్నెండో తరగతి విద్యార్థుల పాసింగ్ ఔట్ పరేడ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో సైనిక పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

313 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైమ్: స్థానిక అశోక్‌నగర్ సమీపంలో మద్యం విక్రయిస్తున్న మహిళను టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 313 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై రాజేష్, ఏఎస్ఐ పైడితల్లి, శ్రీను, తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న ఇద్దరి అరెస్ట్

మండల పరిధిలోని జొన్నవలస గ్రామం శివారులో కోడిపందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను రూరల్ ఎస్సై వాసుదేవ్ శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.11వేల 200 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. వెండి మంటపంలో ఉన్న సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో ఉంచారు. అనంతరం దీపాలు వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకస్వాములు